జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 117 | శనివారం 20 సెప్టెంబరు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.



## తుమ్మిడిహెట్టి బ్యారేజీకి 5,373 కోట్లు

లింక్-1లో బ్యారేజీ, ఇతర పనులకు కలిపి 22,210 కోట్ల వ్యయం!

ప్రాజెక్టుకు ఇప్పటికే 7 రకాల అనుమతులుడీపీఆర్ తయారీకి కసరత్తు

2 లో




# ఫిరాయింపు ఎక్కడిది

## వారి జీతంలో నెలకు 5 వేలు ఇప్పటికీ బీఆర్ఎసకు ఫండ్‌గా వెళ్తోంది

బీఆర్ఎసకు 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని హరీశ్‌రావే అసెంబ్లీలో స్వయంగా ప్రకటించారు

ఎంతో మంది ఎమ్మెల్యేలు వచ్చి కలుస్తుంటారు

మర్యాదపూర్వకంగా కండువాలు కప్పుతాం

మెట్రో రెండో దశకు ఎల్ అండ్ టీ సహకరించాల్సిందే

సీబీఐకేసులో కేసీఆర్‌ను రక్షించేందుకు కిషన్‌రెడ్డి యత్నం

నక్సలైట్లు మన అన్నదమ్ములే కదా! ఎందుకు చర్చించరు?

2018లోనే రాష్ట్రంలో ఓటు చోరీ.. రజత్ అంగీకారం

జీఎస్టీ సంస్కరణలతో తెలంగాణకు 7 వేల కోట్ల నష్టం

ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (సందేశం టైమ్స్) : ముఖ్యమంత్రిగా తన వద్దకు పార్టీలకతీతంగా ఎంతో మంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం వస్తుంటారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వారికి మర్యాదపూర్వకంగా కండువాలు కప్పుతామని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. బీఆర్ఎసకు 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారంటూ ఆ పార్టీ నేత హరీశ్ గత అసెంబ్లీ సమావేశాల్లోనే అధికారికంగా చెప్పారని పేర్కొన్నారు. అలాంటప్పుడు ఇంకా ఫిరాయింపు ఎక్కడిదని ప్రశ్నించారు. అయినా.. పార్టీ ఫిరాయించారని ఆరోపిస్తున్న ఎమ్మెల్యేల నెల జీతం నుంచి నేటికీ బీఆర్ఎసకు నెలకు రూ.5 వేల చొప్పున పార్టీ ఫండ్ వెళుతోందని చెప్పారు. మిగతా 2లో...

## ప్రాధాన్య క్రమంలో పనుల ప్రతిపాదనలు పంపండి



హ్యామ్ రోడ్ల టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో..అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి సూచనలు

హైదరాబాద్, సెప్టెంబరు 19(సందేశం టైమ్స్) : వివిధ ప్రభుత్వ శాఖల్లోని అభివృద్ధి పనులకు సంబంధించి ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు పంపాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలు, ప్రధాన పనుల(క్యాపిటల్ వర్క్స్) క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. మిగతా 2లో...

## ఈ ఏడాది చివరికి అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్



అక్టోబరు నెలాఖరు కల్లా నిర్మాణ పనులు పూర్తవ్వాలి

అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు19 (సందేశం టైమ్స్) : సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని ఈ ఏడాది చివరి నాటికి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా అక్టోబరు నెలాఖరుకు నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు సనత్‌నగర్, ఎల్బీనగర్, కొత్తపేట టిమ్స్ ఆస్పత్రులు, నిమ్స్ ఆస్పత్రి విస్తరణ, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైద్య కళాశాల నిర్మాణ పనులపై ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మిగతా 2లో...

## బతుకమ్మ ఆడుదాం రండి



సునీత, సబితకు మహిళా కాంగ్రెస్ ఆహ్వానం

(సందేశం టైమ్స్): బతుకమ్మకుంటలో బతుకమ్మ ఆడుదాం రండంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని మహిళా కాంగ్రెస్ ఆహ్వానించింది. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావ్ ఈ మేరకు ఆహ్వానం పలికారు. సొంత చెల్లెలినే పార్టీ నుంచి బయటికి పంపిన చరిత్ర కేటీఆర్‌దని, బతుకమ్మపైన పాటను విడుదల చేసే ముందు ఆయన ఆడబిడ్డలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. మిగతా 2లో...

## రేవంత్ ఢిల్లీలో ఉంటూ పాలన గాలికొదిలేశారు



ఏసీడీపీ నిధులివ్వకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

గ్రామపాలనను ప్రభుత్వం నాశనం చేస్తోంది

పండగపూట చార్జీలు పెంచి దండుకోవడం సిగ్గుచేటు: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 19 (సందేశం టైమ్స్) : తెలంగాణలోకన్నా.. ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటూ సీఎం రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేశారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎమ్మెల్యేల ఎసీడీపీ నిధులు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్ర భుత్వం అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆరోపించారు. సర్కారు చర్యలతో నియోజకవర్గాల్లో అభివృద్ధి పను లు పూర్తిగా నిలిచిపోయాయని శుక్రవారం ఎక్స్‌వేదికగా ఆయన పేర్కొన్నారు. 'గ్రామపాలనను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. నిధుల్లేక పంచాయతీలు అవస్థలు పడుతున్నాయి. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు లేరు. డీజిల్‌కు డబ్బుల్లేక పంచాయతీ ట్రాక్టర్లు మూలనపడ్డాయి. మిగతా 2లో...

## ఎమ్మెల్యేలను దొంగిలించడం పెద్ద నేరం

రాహుల్‌ది రెండు నాల్కల ధోరణి

బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్

రేపటి తెలంగాణ భవిష్యత్తును జూబ్లీహిల్స్ ఎన్నిక నిర్ణయిస్తుంది: కేటీఆర్




హైదరాబాద్, సెప్టెంబరు 19 (సందేశం టైమ్స్) : ఎమ్మెల్యేల చోరీపై మాట్లాడకపోవడం రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని, ఆయనకు సిగ్గుశరం ఉంటే.. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజాతీర్పు కోరాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఓట్లచోరీ ఒక నేరమైతే, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను దొంగిలించడం అంతకంటే పెద్ద నేరమని, అది ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మిగతా 2లో...

## తెలంగాణలో భారత్ ఫ్యూచర్ సిటీ



అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ నగరం.. దేశ భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా నిర్మాణం

మొదటి దశలో 30 వేల ఎకరాల్లో 9 జోన్లతో ఏర్పాటు


పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ సదస్సులో సీఎం రేవంత్ వెల్లడి

ప్రపంచ ఆర్థిక సద స్సు అధ్యక్షుడు, న్యూజెర్సీ గవర్నర్, పారిశ్రామికవేత్తలతో చర్చలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19(సందేశం టైమ్స్) : భారతదేశ భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అది అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రణాళికాబద్ధమైన అత్యుత్తమ నగరంగా విలసిల్లుతుందన్నారు. మిగతా 2లో...

## రాష్ట్రంలో ట్రిపుల్ ప్లే సేవలు ప్రారంభించనున్న బీఎస్ఎన్ఎల

రూ. 299కే ఇంటర్నెట్, వాయిస్ కాల్స్, ఫైబర్‌టీవీ సేవలు




హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్) : రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరలకే ట్రిపుల్ ప్లే(ఎఫటీటీహెచ్) సేవలను భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) ప్రారంభించనుంది. సెప్టెంబర్ 23 నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని, రూ. 299 నుంచి ధరలు ప్రారంభమవుతాయని సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. మిగతా 2లో...

# తుమ్మిడిహెట్టి బ్యారేజీకి 5,373 కోట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 19 (సందేశం టైమ్స్) : ప్రాణహిత–చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి రూ.5,373 కోట్లు వ్యయం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. దీనితోపాటు లింక్–1 (తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు) కెనాల్, పంపుహౌస్, ఇతర పనులకు మరో రూ.16,837 కోట్లు అవుతాయని లెక్క వేసింది. 150 మీటర్లతో బ్యారేజీ కడితే 1,467 ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని.. అదే 148 మీటర్ల ఎత్తుతో కడితే ముంపు 288.01 ఎకరాల మేర ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇక 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే జరిగే ముంపులో 11.82 ఎకరాల అటవీ భూమి ఉంటోందని గుర్తించారు. ప్రాణహిత–చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి సంబంధించి గత ప్రభుత్వం నిలిపివేసిన పనులు/కాంపోనెంట్లను మళ్లీ చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలాగైనా ఒప్పించాలని, అవసరమైతే ముంపునకు గురయ్యే 1,467 ఎకరాల భూములకు గరిష్ఠ పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించి డీపీఆర్ తయారీ కోసం కసరత్తు ప్రారంభించింది

# ఈ ఏడాది చివరికి అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్

సనత్‌నగర్ ఆస్పత్రి నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, ఎల్బీనగర్ టిమ్స్ పనులు మరో 6 నెలల్లో పూర్తి అవుతాయని అధికారులు మంత్రికి వివరించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను ఈ ఏడాది చివరిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించిన విషయాన్ని మంత్రి దామోదర ఈ సందర్భంగా అధికారులకు గుర్తు చేశారు. ఇరుశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆస్పత్రి ప్రారంభించిన రోజు నుంచే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా అత్యాధునిక వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని వైద్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తుకు సూచించారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నియామకం చేపట్టాలని వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్‌ను ఆదేశించారు.

# రేవంత్ ఢిల్లీలో ఉంటూ పాలన గాలికొదిలేశారు

పండుగ పూట వీధిదీపాలు వెలగక గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి. పండుగ వస్తే చాలు ఆర్టీసీ చార్జీలను అడ్డగోలుగా పెంచి ప్రజల నడ్డివిరిచేందుకు సిద్ధంకావడం సిగ్గుచేటు. బతుకమ్మ, దసరా సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులపై పెనుభారం మోపుతూ పండుగ సంబరం కూడా లేకుండా చేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్‌గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించిచేస్తున్న ఈ దోపిడీ ముమ్మాటికీ ప్రజాపీడనే అవుతుంది' అని హరీశ్ రావు ప్రభుత్వంపై మండిపడ్డారు.

## ఎమ్మెల్యేలను దొంగిలించడం పెద్ద నేరం

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ బూత్‌స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఫిరాయింపు రాజకీయాలను అందరూ అసహ్యించుకుంటున్నారని, సరైన సమయంలో ఆపార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీల జాయింట్ వెంచర్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వమని, మోదీ ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణలను దేశంలో అందరి కంటేముందు తెలంగాణ ప్రభుత్వమే అమలు చేసిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలయినా ముస్లిం మైనార్టీకి చెందిన వ్యక్తికి మంత్రి పదవి కట్టబెట్టలేదని, ఓట్ల కోసం వచ్చే మంత్రులు, కాంగ్రెస్ నేతలను ముస్లింలు నిలదీయాలన్నారు. రేపటి తెలంగాణ భవిష్యత్తును జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నిర్ణయిస్తుందని, అరచేతిలో వైకుంఠం చూపించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్‌లో కాల్చివాత పెట్టాలన్నారు. మాగంటి గోపీనాథ్ సేవల్ని కొనసాగిస్తామని ప్రజలముందుకు వచ్చిన ఆయన సతీమణి సునీతమ్మను అందరూ ఆశీర్వదించాలని కోరారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తుపెంచి తెలంగాణ రైతాంగానికి మరణశాసనం రాస్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో జల్సాలు చేస్తున్నారని విమర్శించారు. ఆల్మట్టి డ్యాం ఎత్తును 519 అడుగుల నుంచి 52 4అడుగులకు పెంచాలని కర్ణాటక మంత్రిమండలి నిర్ణయం తీసుకుంటే సీఎంకు ఏమాత్రం పట్టడంలేదని ఆయన అన్నారు

## రాష్ట్రంలో ట్రిపుల్ ప్లే సేవలు ప్రారంభించనున్న బిఎస్ఎన్ఎల

ఈ ప్యాకేజీ ద్వారా హై స్పీడ్ ఇంటర్నెట్, అపరిమిత టెలిఫోన్ కాలింగ్, అనేక ఛానెళ్లను అందించే ఫైబర్ టీవీ వంటి మూడు సేవలు ఒకే కనెక్షన్ ద్వారా పొందవచ్చు. గ్రామీణ ప్రాంతాలకు కూడా అధునిక డిజిటల్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని సంస్థ తెలంగాణ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ అన్నారు. ఇక, నగర వినియోగదారుల కోసం ఐపీటీవి, ఫైబర్ టీవీ వంటి ఆడ్–ఆన్ ప్యాకేజీలు కూడా బీఎసఎన్ఎల్ అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్యాకేజీలలో స్క్రైప్రో, స్మార్ట్ ప్లే టీవీ, ఉల్కా టీవీ వంటి ఓటీటీ సేవలు ఉంటాయని అధికారులు తెలిపారు.

## ప్రాధాన్య క్రమంలో పనుల ప్రతిపాదనలు పంపండి

కమిటీలో సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అత్యవసరమైన ప్రధాన పనులకు ప్రాముఖ్యమివ్వాలని చెప్పారు. గతంలో ఒక్క శాతం నిధులకు 16 రెట్ల విలువైన పనులను ప్రతిపాదించేవారని, దాంతో నిధులు సరిపోక పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పుడలా కాకుండా ఒక్క శాతం నిధులకు మూడు రెట్ల విలువైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ప్రతిపాదనలను ఆమోదించే సందర్భంలో ఈ మూడు రెట్ల విలువైన ప్రతిపాదనలను మరింత కుదించడం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రతిపాదనలను కూడా ఆయా శాఖల అధికారులు ప్రాధాన్య క్రమంలో హేతుబద్ధీకరించాలన్నారు. అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు వారంలోగా పూర్తిస్థాయి ప్రతిపాదనలతో సమావేశానికి రావాలని ఆదేశించారు.

# ఫిరాయింపు ఎక్కడిది

ఇక వారు పార్టీ ఫిరాయించినట్టు ఎలా అవుతుందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం స్పీకర్ వ్యవహరిస్తారని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలకు సంబంధించి సుప్రీంకోర్టు నిర్ణయానికి అనుగుణంగానే తాము స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. "బీసీలకు 42శ్ల రిజర్వేషన్లకు సంబంధించి మూడు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రపతి నిర్ణయం తీసుకునే గడువు అంశం సుప్రీంకోర్టులో ఉంది. దీనిపై సుప్రీంకోర్టు ఏం చెబుతుందో చూస్తాం. ఆ తర్వాత న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. మళ్లీ కోర్టుకు వెళ్లాలా? వద్దా? అనేది అప్పుడే నిర్ణయిస్తాం. అవసరమనుకుంటే హైకోర్టులోనే మరికొంత సమయం కోరతాం" అని సీఎం వివరించారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని కేసీఆర్ విధించారని, ఇప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి బీఆర్ఎస్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

మెట్రో పూర్తికావడం కిషన్‌రెడ్డికి ఇష్టంలేదు..

మెట్రో రెండోదశ పూర్తికావడం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి, కేటీఆర్‌కు ఇష్టంలేదని, వాళ్ల స్వార్థ ప్రయోజనాల కోసం దానిని ముందుకు కదలనివ్వడం లేదని సీఎం రేవంత్ ఆరోపించారు. మెట్రో బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు ఎల్అండ్‌టీ చెప్పలేదన్నారు. మొదటి దశలో నష్టం వచ్చిందని ఆ సంస్థ చెబుతోందని, కేసీఆర్, ఎల్అండ్‌టీ చేసిన తప్పులకు ప్రజలు నష్టపోవాలా? అని ప్రశ్నించారు. 2017లోనే మెట్రో రెండోదశ పూర్తికావాల్సి ఉందని, కానీ.. కేసీఆర్ నిర్లక్ష్యంతో అది నేటికీ ముందుకు సాగడం లేదని అన్నారు. మెట్రో రెండోదశ పనుల కోసం ప్రధాని మోదీని కలిసిన ప్రతిసారీ అడుగుతున్నామని, అయినా ఫలితం లేదని చెప్పారు. రెండోదశకు సహకరించాల్సిన బాధ్యత ఎల్అండ్‌టీపై ఉందని, అలా కాకుండా వారు చెప్పినట్టే తాము వినాలన్నట్లుగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మెట్రో విస్తరణకు అనుమతి కావాలంటే.. ఎల్అండ్‌టీతో ఒప్పందం చేసుకుని రావాలని కేంద్రం చెబుతోందని, ఇదంతా.. కేటీఆర్, కిషన్‌రెడ్డి ఆడుతున్న డ్రామా అని మండిపడ్డారు. మెట్రోలో రోజుకు సగటున 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారని, విస్తరణ పూర్తయితే రోజుకు 15 లక్షల మంది ప్రయాణిస్తారని తెలిపారు.

కేసీఆర్‌ను రక్షించేందుకు కిషన్‌రెడ్డి ప్రయత్నం..

కేసీఆర్ కుటుంబానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. "కాళేశ్వరం దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేసినందుకే అప్పగించాం. సీబీఐకి ఇస్తే 48 గంటల్లో విచారణ చేయిస్తామని, అవినీతి లెక్కలేంటో తేలుస్తామని ఆయన మాట్లాడారు. మరి ఇప్పుడు ఏమైందో చెప్పాలి. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే అన్ని వివరాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం" అని రేవంత్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందనే విషయం మాత్రమే కమిషన్ చెబుతుందని, చర్యలు తీసుకునేది దర్యాప్తు సంస్థలేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు చేస్తే నిజాలన్నీ బయటికి వస్తాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తును కేటీఆర్ అడ్డుకుంటున్నారని, కేటీఆర్ చెప్పినందుకే కిషన్‌రెడ్డి కేంద్రంలో విచారణను తొక్కిపట్టారని ఆరోపించారు. కిషన్‌రెడ్డికి సొంత తెలివి లేదని, కేటీఆర్‌ను అద్దెకు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఆలోచనల్నే కిషన్‌రెడ్డి అమలు చేస్తారు తప్ప.. ఆయనకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేదే కిషన్‌రెడ్డి అని, రాష్ట్రానికి ఏ ప్రాజెక్టు రావడమూ ఆయనకు ఇష్టం లేదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు హైకోర్టులో ఉందని, దానిపై మాట్లాడడం సరికాదని పేర్కొన్నారు. ఒకవేళ హైకోర్టు పరిధిలో లేకపోతే.. సీబీఐకి అప్పగించే అంశంపై ఆలోచించేవాళ్లమని చెప్పారు.

# తెలంగాణలో భారత్ ఫ్యూచర్ సిటీ

శుక్రవారం ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మొదటి దశలో 30 వేల ఎకరాల్లో 9 జోన్లలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, ఏఐ సిటీ, హెల్త్ జోన్, విద్యాజోన్ మొదలైనవి ఇందులో ఉంటాయని చెప్పారు. విమానాశ్రయంతో భారత్ ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేస్తామన్నారు. మచిలీపట్నం ఓడరేవు అనుసంధానానికి ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను, సమాంతరంగా రైల్వేలైన్ ను మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. సదస్సులో ఆయన ప్రపంచ ఆర్థిక సదస్సు అధ్యక్షుడు బ్రెండే, న్యూజెర్సీ గవర్నర్ మర్ఫీతో సహా పలు కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమల యజమానులతో కీలక చర్చలు జరిపి.. వారిని రాష్ట్రంలో పెట్టుబడులకు, అభివృద్ధికి తోడ్పాటునందించాల్సిందిగా కోరారు. దేశంలో యువ రాష్ట్రమైన తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి విజన్–2047ను రూపొందించామని, 2025 డిసెంబరు 9న తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను వెల్లడిస్తామని అన్నారు. తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అర్బన్‌గా విభజించామని తెలిపారు. కోటి మందికి పైగా నివసించే కోర్ అర్బన్ ఏరియాలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలిస్తామని, సెమీ అర్బన్ ఏరియాను మాన్యుఫ్యాక్చర్ రంగానికి కేటాయిస్తామని చెప్పారు.

ట్రంప్ నిర్ణయాలతో అమెరికాకే నష్టం..

హైదరాబాద్‌లో ఇప్పటికే 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లకు పొడిగిస్తామని, మూసీ పరివాహక ప్రాంతాన్ని సబర్మతి తీరంలా మారుస్తామని సీఎం రేవంత్ అన్నారు. హైదరాబాద్ లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామని, 2027 నాటికి నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలే ఎక్కువ ఉండబోతున్నాయని చెప్పారు. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో, వ్యాక్సిన్ల తయారీలోనూ తెలంగాణ అగ్రగామిగా ఉన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాల వల్ల ఆ దేశానికే నష్టమని తెలిపారు. ట్రంప్ ఒకరోజు మోదీ తన మిత్రుడు అంటారని, మరో రోజు అడ్డగోలుగా సుంకాలు వేస్తారని విమర్శించారు. తెలంగాణలో కూడా ఒక ట్రంప్ ఉండేవారని, ఆయనను ప్రజలు పక్కన పెట్టారని కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. కరువు, వరదలతోపాటు పర్యావరణ సంక్షోభాన్ని తట్టుకునే ఏకైక నగరంగా హైదరాబాద్‌ను రూపొందిస్తామన్నారు.

# గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి శుభారంభం

## పాత భవనం కూల్చివేత ప్రారంభం






సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధిసెప్టెంబర్ 19 సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ మర్వేల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం నూతన రూపంలో వెలుగులు చూస్తోంది. పాత పంచాయతీ భవనం ఏళ్ల కాలంగా నిలిసిపోయిన నేపథ్యంలో, నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందిఅన్ని టీ పి సి సి రాష్ట్ర వైస్ ప్రసిడెంట్ పట్లోల సంగమేశ్వర్ ఆధ్వర్యంలో నేడు పాత భవనాన్ని అధికారుల సమక్షంలో కూల్చివేయడం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివశరణ్, మాజీ ఉపసర్పంచ్ బస్వరాజు, పంచాయతీ కార్యదర్శి బినాసిరోద్దీన్, రాజు పటేల్,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. భవిష్యత్తులో ఆధునిక సదుపాయాలతో నిర్మించబోయే ఈ నూతన భవనం గ్రామ అభివృద్ధికి ఒక మైలురాయిగా నిలవనుందని అధికారులుతెలిపారు.

## తిరుపతి కొండ నడిచి వెళ్లే భక్తులకు మార్గమధ్యలో దర్శనము టికెట్స్ ఇవ్వాలి

## న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్



సందేశం టైమ్స్ :సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిసంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంఆంధ్రప్రదేశ్,తిరుపతి లో తిరుమలకు నడిచి వెంకటేశ్వర స్వామి దర్శనం పొందేందుకు వెళ్లే భక్తులకు మార్గమధ్యంలో దర్శనం టికెట్లు గతంలో ఇచ్చినట్లుగా ఇవ్వాలని భక్తుల ఆందోళన తో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ తిరుపతికి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుండి మరియు భారతదేశం నుండి 29 రాష్ట్రాల నుండి భక్తులు రైలు ప్రయాణ మార్గాల ద్వారా తిరుపతికి వచ్చేసరికి సమయం సుమారు ఉదయం 9 గంటలు పడుతుందని ఇట్టి సమయంలో తిరుమల కొండ నడిచి వెళ్లే భక్తులకు అలిపిరి వద్ద మరియు శ్రీవారి మెట్ల మార్గం ముందు ఏర్పాటుచేసిన కౌంటర్లో దర్శనం టికెట్లు అందరికీ అనుకూలంగా దొరుకుటకు అసౌకర్యంగా ఉందని తెలియజేస్తూ ఇట్టి విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకొని దృష్టి పెట్టి భక్తుల యొక్క కోరిక మేరకు గతంలో యధావిధిగా తిరుమల కొండ నడిచే మార్గమధ్యంలో ఏర్పాటుచేసిన దర్శనం టికెట్ల కౌంటర్ ను ఏర్పాటు చేసి నడిచి వెళ్లే భక్తులకు ప్రత్యేక దర్శన మార్గమును ఏర్పాటు చేసి భక్తుల యొక్క విజ్ఞప్తిని గౌరవించి త్వరగా సవరణ చేసి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు కూడా వాళ్ల యొక్క భావాలను, తిరుమలలో ఎదుర్కొంటున్న సమస్యలను టీటీడీ చైర్మన్ మరియు టీటీడీ యంత్రాంగం దృష్టికి తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ యొక్క తిరుమల భక్తుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పి ఎం సి మెడిటేటర్ మీనా రాధా కాంటెస్టెడ్ మెదక్ పార్లమెంట్ కాన్స్టెన్సీ ఎంపీ జి సాయ గౌడ్ కళాకారుడు సుధాకర్ ల్ క్రీడాకారిని గాయత్రి లక్ష్మిమి ప్రమీల మరియు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం కావాలి






సందేశం టైమ్స్ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిసెప్టెంబర్ 19సంగారెడ్డి జిల్లాతారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో ఎన్.ఎస్.ఎస్ విభాగాలు మరియు వృక్షశాస్త్ర విభాగము ఆధ్వర్యంలో ఈ.పి.టి. ఆర్.ఐ వారి సహకారంతో పర్యావరణ పరిరక్షణపై పెయింటింగ్, స్లోగన్ రైటింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించడమే కాకుండా స్వచ్ఛభారత్ లో భాగంగా స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపినారు. పర్యావరణంలో సమతుల్యత ఉన్నప్పుడే జీవరాశి మనుగడ సాధ్యమవుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించి, భవిష్యత్తు తరాలకి ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించే బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. ఇందులో భాగంగా యువతలో పర్యావరణం పై అవగాహన కల్పించుటకు ఈ.పి.టి. ఆర్.ఐ వారి సహకారంతో సేవ లో భాగంగా విద్యార్థులకు పెయింటింగ్, స్లోగన్ రైటింగ్, ఎస్సే రైటింగ్ పోటీలను నిర్వహించడం జరిగిందని తెలిపినారు. అనంతరం పర్యావరణం పై విద్యార్థులకు సరైన అవగాహన కల్పించడానికి కళాశాలలో స్వచ్ఛభారత్ లో భాగంగా స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ శ్రమదానము ద్వారా వ్యర్థ పదార్థాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం జరిగిందని తెలిపినారు. యువత పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సరియైన అవగాహనను పెంపొందించుకున్నప్పుడే పర్యావరణ సమతుల్యత ఏర్పడి భవిష్యత్తు తరాలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధిపతి డాక్టర్ ఎస్.విజయ, ఎన్.ఎస్.ఎస్. అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వాణి, డాక్టర్ జోష్ణ ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు విద్యార్థిని, విద్యార్థులుపాల్గొన్నారు.

## విద్యాభివృద్ధి కోసం రోటరీ ఇంటర్నేషనల్ కృషి

## పుల్కల్ మండల విద్యాధికారి శంకర్



సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి సెప్టెంబర్ 19సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని గొంగ్లూర్ తాండ పాఠశాలలో మంజీరా రోటరీ క్లబ్ సంగారెడ్డి వారు విద్యార్థులకు బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు, వ్రాత సామాగ్రి, మైక్ సెట్ అందించారు. 30 వేల రూపాయల విలువగల వస్తువులను రోటరీ క్లబ్ సభ్యుడు దాత కమలాకర్ రాజు అందించారు. విద్యాభివృద్ధి కోసం రోటరీ క్లబ్ కృషి చేస్తుందని పుల్కల్ మండల విద్యాధికారి శంకర్ తెలిపారు. రోటరీ ఇంటర్నేషనల్ కార్యక్రమాల గురించి మంజీరా రోటరీ క్లబ్ అధ్యక్షులు కిషన్ వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పోలియో లేకుండా కృషి చేసిందని సమాజంలో సేవలు అందించడానికి ఎప్పుడు ముందుంటుందని ఆయన తెలిపారు. సమాజం నుండి మనం ఎంతో పొందుతాం తిరిగి ప్రతి ఒక్కరూ సమాజానికి కొంత నైనా అందించాలని పే బ్యాక్ టు సొసైటీ అని విశ్రాంతి మండల విద్యాధికారి, అడ్వకేట్, మరియు రోటరీ సభ్యులు డి.అంజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు దినేష్ గోంగులూరు తాండ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, శివంపేట్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ, సిఆర్పిలు వినయ్, ప్రభాకర్ అమ్మ ఆదర్శ పాఠశాల పాఠశాల చైర్మన్ రేణుక, వి ఏవో, గ్రామ కార్యదర్శి ప్రభాకర్పాల్గొన్నారు.




## 2002-2025 ఓటరు జాబితాల సరి పోలిక పకడ్బందీగా చేయాలి:

## ముఖ్య ఎన్నికల అధికారి







సందేశం టైమ్స్సూర్యాపేట, 19 సెప్టెంబర్ 2025,2002, 2025 ఓటరు జాబితాల సరి పోల్చే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ "ఓటర్ల జాబితాలను నాలుగు కేటగిరీలుగా విభజించి పరిశీలన జరపాలి. ఎ కేటగిరీలో 2002, 2025 రెండింటిలో పేరు ఉంటే డాక్యుమెంట్లు అవసరం లేదు. బి కేటగిరీలో 2002 జాబితాలో పేరు లేకపోయినా, 1987కు ముందు పుట్టినవారు కనీసం ఒక గుర్తింపు పత్రం సమర్పించాలి. సి కేటగిరీలో 1987-2002 మధ్య పుట్టినవారు స్వీయ పత్రం, కుటుంబ పత్రం సమర్పించాలి. డి కేటగిరీలో 2004 తరువాత జన్మించి, 2025లో పేరు ఉన్నవారు స్వీయ పత్రం, తల్లిదండ్రుల పత్రం తప్పనిసరిగా ఇవ్వాలి" అని వివరించారు.ఈ నెల 24వ తేదీలోగా నివేదికలు సమర్పించాలని, ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, "రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. అధికారులు సమన్వయంతో ఈ ప్రక్రియను వేగవంతం చేస్తాం" అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ వేణు తదితరులుపాల్గొన్నారు.

## పిల్లల పోషణలో తల్లిదండ్రుల పాత్ర కీలకం:

## సంక్షేమ అధికారి దయానంద రాణి



సందేశం టైమ్స్:సూర్యాపేట, 19 సెప్టెంబర్ 2025పోషణ మాసం-2025లో భాగంగా శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వద్ద అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా అంగన్వాడీ పిల్లల తండ్రులతో అనుబంధ ఆహార వంటకాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి దయానంద రాణి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆవెం మాట్లాడుతూ, "ఆరు నెలల వయస్సు దాటిన శిశువులకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం తప్పనిసరి. ఇది పిల్లల శారీరక, మానసిక, మేధో అభివృద్ధికి మేలు చేస్తుంది. లోపపో షణను నివారిం చడా నికి తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి" అని తెలిపారు. అలాగే ప్రతినెల అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తు కొల తల ను సక్రమంగా తూకం వేసి, అంగన్వాడీ టీచర్ల ద్వారా పోషణ స్థితి గురించి తెలు సుకో వాలని సూచిం చారు. కార్య క్రమం లో పాల్గొన్న తం డ్రులతో పోషకాహారం ప్రాము ఖ్యతపై ప్రతి జ్ఞ చేయించారు.

## 119 పుస్తకాలు అందించిన మెదక్ జిల్లా

## గ్రంథాలయ సంస్థచైర్ పర్సన్ చిలిముల సుహాసిని రెడ్డి





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ ప్రతినిధి 19సెప్టెంబర్నర్సాపూర్ పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చిలిముల సుహాసిని రెడ్డి గారు 119 రకాల విలువైన పుస్తకాలను అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "1997లో కీర్తిశేషులు చిలుముల విట్టల్ రెడ్డి గారు 22 ఎకరాల భూమిని సమకూర్చి ఈ విద్యాసంస్థను స్థాపించిన?శ్రేష్ఠ కృషిని మరువలేము. ఉమ్మడి రాష్ట్రంలో మొదటి రెసిడెన్షియల్ పాఠశాలగా నిలిచిన ఈ కళాశాల, విద్యారంగంలో అపురూప దార్శనికతకు నిదర్శనం," అని గుర్తు చేశారు.అలానే, "పేద, బలహీన, అణగారిన వర్గాలకు విద్యను అందించడం ద్వారా కులమత భేదాలను తుడిచివేయవచ్చు. ఈ ఆశయాల దిశగా మేము ఎల్లప్పుడూ వారి అడుగుజాడల్లో నడుస్తాము" అంటూ భావోద్వేగంగా తెలిపారు.ఈ కళాశాల నుండి ఎన్నో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్న విషయం గర్వకారణమని పేర్కొన్నారు. "మీరు కూడా శ్రేష్ఠ విజయాలను సాధించాలని కోరుకుంటూ, ఈ కార్యక్రమంలో భాగమైనందుకు గర్వంగా ఉంది" అన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, చిలిపిచెడ్ మండల మాజీ జెడ్పిటిసి చిలుముల శేష సాయి రెడ్డి, కళాశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రాయ్, బండారి గంగాధర్, జ్యోతి సురేష్ నాయక్, హబీబ్ ఖాన్, చిన్న చిన్నం రెడ్డి, చంద్రం కృష్ణ గౌడ్, కౌడ శ్రీనివాస్ గుప్తా, సావిత్రి రెడ్డి, కొడెకంచి శ్రీనివాస్ గౌడ్, అజ్మత్, రిజ్వాన్, నాగేష్, రాధాకృష్ణ, జంగం వెంకటేష్, సాయి చరణ్ గౌడ్, రవి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

# విశాఖలో ఎయిర్ ఇండియా విమానానికి తప్పిన ముప్పు

**బయలుదేరిన కొద్దిసేపటికే ఢీకొన్న పక్షి దీంతో వెనక్కి మళ్లింపు.. విమానంలో 103 మంది**



విశాఖపట్నం సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం హైదరాబాద్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానానికి పెద్ద ముప్పు తప్పింది. 103 మంది ప్రయాణికులతో మధ్యాహ్నం 2.38 గంటలకు ఈ విమానం విశాఖ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. కేవలం తొమ్మిది నిమిషాల్లోనే... 2.47 గంటల సమయంలో తిరిగి వెనక్కి వస్తున్నట్టు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)కు పైలట్ సమాచారం అందించారు. సరిగ్గా మూడు గంటలకు సురక్షితంగా విమానాన్ని ల్యాండింగ్ చేశారు. గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే ఓ పక్షి విమానంలో రెండో నంబరు ఇంజన్‌ను ఢీకొట్టిందని, దానివల్ల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉండడంతో విమానాన్ని వెనక్కి తీసుకువచ్చారని విమానాశ్రయం వర్గాలు తెలిపాయి.

# సంగారెడ్డికి కొత్త అదనపు ఎస్పీ (అడ్మిన్)

## శ్రీ సి.హెచ్. రఘునందన్ రావు బాధ్యతల స్వీకరణ





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 19: సంగారెడ్డి జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమితులైన శ్రీ సి.హెచ్. రఘునందన్ రావు ఈ రోజు అధికారికంగా తన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని, జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.శ్రీ రఘునందన్ రావు 1995 బ్యాచ్ ఎస్ఐ. పోలీసులు శాఖలో విశేష అనుభవం కలిగిన వారు. గతంలో తెలంగాణ పోలీస్ అకాడమీలో డిఎస్పీగా సేవలందించారు. ఇటీవల అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన, బదిలీపై సంగారెడ్డికి వచ్చి, ఈ రోజు అధికారికంగా కొత్త బాధ్యతలను చేపట్టారు.జిల్లా పోలీస్ వ్యవస్థలో ఆయన అనుభవం విలువైనదిగా ఉండనుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# కుప్పంలో దారుణం.. భార్యపై అతికిరాతకంగా కత్తితో దాడి..




చిత్తూరు: సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్):మానవత్వం మరిచి మనిషి మృగంలా మారి దారుణాలకు పాల్పడుతున్న ఘటనలు తరుచూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఆలోచన ధోరణిని మరిచి క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలకు బలి అవుతున్నారు. కొందరు అయితే జాలి, దయ అనే వాటిని మరిచి, పాశవికంగా వ్యవహరిస్తున్నారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలుపాలు అవుతున్నారు. ఎందుకు చేస్తున్నామో.. దేనికోసం చేస్తున్నామో కూడా తెలియకుండా ఆవేశంలో ప్రాణాలను హరిస్తున్నారు. ఓ మనిషి మృగంలా మారి భార్యను అతికిరాతకంగా నరికిన ఘటన కుప్పం మండలంలో వెలుగు చూసింది.కుప్పం మండలం బైరప్ప కొట్టాలలో భార్యను అతికిరాతకంగా కత్తితో నరికాడు ఓ భర్త. వివరాల్లోకి వెళితే.. బైరప్ప కొట్టాలు గ్రామానికి చెందిన కీర్తనకు తమిళనాడు రాష్ట్రం వేపనపల్లె సమీపంలోని తీర్థం గ్రామానికి చెందిన రాజేష్‌కు సుమారు రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే ప్రసవం కోసం పుట్టింటికి వచ్చిన కీర్తన పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డను చూడటానికి వచ్చిన రాజేష్.. ఒక్కసారిగా కత్తితో కీర్తనపై అతికిరాతకంగా దాడికి పాల్పడ్డాడు.దీని గమనించిన స్థానికులు అరుపులు కేకలు వేయడంతో అక్కడి నుంచి పరుగులు తీశాడు. అనంతరం సమీపంలోని ఓ ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే స్థానికులు రాజేష్‌ను పట్టుకుని చెట్టుకు కట్టి వేశారు. హుటాహుటిన కీర్తనను కుప్పం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

# రైతులు పొగాకు సాగును తగ్గించుకోవాలి




**ఒంగోలు పొగాకు వేలంకేంద్రం రెండులో రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి తులసి**

ఒంగోలు(రూరల్) సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్):చైనా, బ్రెజిల్ వంటి దేశాలలో పొగాకు పంట ఉత్పత్తి పెరిగినందున భారతదేశం నుంచి ఎగుమతులు తగ్గేపరిస్థితులు ఉన్నాయని, రైతులు పొగాకు సాగును తగ్గించుకోవాలని ఒంగోలు పొగాకు రెండో వేలం కేంద్రం నిర్వహణాధికారి జె.తులసి స్పష్టం చేశారు. వేలం కేంద్రంలో పొగాకు పంట నియంత్రణ – ప్రత్యామ్నాయపంటలు అనే అంశంపై పొగాకు రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వేలంకేంద్ర అధికారి మాట్లాడుతూ 2024–2025 సంవత్సరానికి సంబంధించి పొగాకు సాగు అధికంగా చేయడంతో ఉత్పత్తి పెరిగి ధరలు లేక పోయిన విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే సీజన్‌లో రైతులు తీవ్రనష్టాలు చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులు ఇప్పుడు ఉన్న పరిస్థితులు తెలుసు కొని పొగాకు పంటసాగును తగ్గించుకోవాలని, ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పొగాకు పంట సాగు చేసే రైతులు తప్పక నారుకొనుగోలు రశీదును నారు అమ్మకాలు చేసేవారి నుంచి పొందాలన్నారు. అలాగే రైతులు బ్యారన్‌ల లీజులు, భూముల లీజ్‌లు అధిక ధరలకు తీసుకోవద్దని వివరించారు. ఈకార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ వెంకటేశ్, జీపీఐ మేనేజర్ కిషోర్, పీఎసఎస్ మేనేజర్ ఆదిత్య, పొగాకు రైతులు, బోర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ సభ వాయిదా



అమరావతి/తుళ్లూరు, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేసేందుకు శుక్రవారం అమరావతిలో నిర్వహించతలపెట్టిన సభ వాయిదా పడింది. ఈ మేరకు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం గుంటూరులో భారీ వర్షాల కారణంగా అభ్యర్థుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని సభను వాయిదా వేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సభను ఎప్పుడు నిర్వహించాలనే దానిపై తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ప్రకటన వెలువడేసరికే రాయలసీమ జిల్లాల నుంచి అభ్యర్థులు బయల్దేరారు. వాయిదా సమాచారం తెలియగానే మధ్యలో వెనుదిరిగారు.

# రోడ్డుపై తీవ్రగాయాలతో బాలుడు



ఏలూరు స్పోర్ట్స్ సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): ఏలూరు శివారు కలపర్రు జాతీయ రహదారికి వెళ్ళే ప్రధాన రహదారిపై ఎస్పీ రంగారావు విగ్రహం ఎదురుగా పొలాల్లో ఒక బాలుడు తీవ్ర గాయాలతో రక్తపుమడుగులో పడిఉన్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడ్ని గుర్తించిన సమీపంలోని ఒక రైతు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు తీవ్ర గాయాలతో పడిఉన్న బాలుడ్ని అంబులెన్స్‌లో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాలుడు అపస్మారక స్థితిలో పడి ఉండడంతో వివరాలు ఏమీ తెలియలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ సంఘటన ప్రస్తుతం ఏలూరు నగరంలో కలకలం రేపుతుంది. బాలుడికి సుమారు 14 నుండి 15 ఏళ్ళ పయస్సు ఉంటుందనీ, కాకీరంగు నిక్కరు, ఎరుపురంగు టీషర్ట్ వేసుకుని ఉన్నాడనీ, అపస్మారక స్థితిలో ఉన్నాడనీ, ఎవరికైనా వివరాలు తెలిస్తే.. పెదపాడు ఎస్ఐ ఫోన్ నెంబర్ 9440796637కు సంప్రదించాలని పోలీస్ అధికారులు కోరారు. ఏలూరు శివారు ఎస్పి రంగారావు విగ్రహం ఎదురుగా పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు దఅష్టి సారించారు. ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, పెదవేగి సీఐ రాజశేఖర్, పెదపాడు ఎస్ఐ సంఘటనా స్థలంలో పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. గుర్తు తెలియని బాలుడు తీవ్ర గాయాలతో పడిఉండడం పై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరైనా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకుపచ్చి కత్తితో పొడిచి పారిపోయారా ? అనే అనుమానం వ్యక్తం అవుతోంది. ఏదైనా ప్రమాదానికి గురైతే తలపై తీవ్రగాయాలు ఆ విధంగా ఉండవు అనే అభిప్రాయం వైద్యులు వ్యక్తం చేస్తున్నారు.

# అంగన్వాడీల 8 రాష్ట్రీయ పోషణ మాసం ప్రోగ్రాం



బి.ముసునూరు (ఏలూరు) సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): మండలంలోని చింతలవల్లిలో 8 రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం అంగన్వాడీ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, స్థూలకాయ నివారణ, చక్కెర, నూనె వినియోగం గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా పౌష్టిక ఆహారం పై సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన అంగన్వాడి స్టాల్ ను అధికారులు సందర్శించారు. చింతలవల్లి టిడిపి నాయకులు పాలడుగు నాగం బాబు , కాటేపల్లి సురేంద్ర , పాలడుగు చిన్ని , అంగన్వాడి టీచర్స్, వైద్య సిబ్బంది,ఏఎన్ఎం, ఆశా వర్కర్స్, ఎమ్ హెచ్ పి జెడ్ బి ఎన్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేతన ఒప్పందం అమలు కోసం మున్సిపల్ కార్మికుల ధర్నా

సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్):కొవ్వూరు సమ్మె కాలపు వేతన ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ కొవ్వూరులో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు.. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 12వ పిఆర్‌సి ప్రకటించాలన్నారు. జీతాలు పెంపుదల, సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలకు జిఒలు విడుదల చేయాలన్నారు. అలాగే సమ్మె కాలపు వేతనాలు విడుదల చేయాలని నినదించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం,సుందర్‌బాబు మున్సిపల్ కార్మికుల ధర్నాకు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు.




కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

# పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

- ◆ ఏడాది కిందట నగరంలో 25 చోట్ల ఏర్పాటు
- ◆ సంవత్సర కాలంలో
- ◆ 74.62 లక్షల మందికి ఆహారం
- ◆ రుచిగా, శుచిగా ఉండడంతో పెరిగిన ఆదరణ




సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్):నగరంలో అన్న క్యాంటీన్లకు విశేష ఆదరణ లభిస్తోంది. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలు, నిరాశ్రయులు, వివిధ పనులపై ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారి ఆకలి తీర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సరిగ్గా ఏడాది కిందట అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. ఈ ఏడాది కాలంలో నగరంలోని 25 అన్న క్యాంటీన్లలో సగటున రోజుకు 23,843 మంది భోజనం చేస్తున్నారు.నిరుపేదలకు నామమాత్రపు ధరకు నాణ్యమైన ఆహారం అందించేందుకు 2018లో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్‌లను ప్రారంభించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను మూసివేయించింది. 2024లో తిరిగి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించారు. గత ఏడాది సెప్టెంబరు 19న జీవీఎంసీ పరిధిలో 25 అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం రూ.5కు అందుబాటులో ఉంచారు. జీవీఎంసీ పరిధిలో తగరపువలస, భీమిలి, మారికవలస, వాంబే కాలనీ, విమ్స్ ఎదురుగా సంజీవగాంధీ నగర్, ఆరిలోవ, ఎంవీపీ రైతుబజార్, పెదవాల్తేరులోని ప్రభుత్వ ఛాతీ, శ్వాసకోశ వ్యాధుల ఆస్పతి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, టర్నర్‌చౌల్ట్రీ, కేజీహెచ్ ఓపీ గేటు పక్కన, వన్‌టౌన్‌లోని జనతాబజార్, తాటిచెట్లపాలెం వైఎస్ఆర్ నగర్, మద్రిపాలెం, నక్కవానిపాలెం ఆర్టీసీ డిపో, శ్రీహరిపురం కోరమాండల్ గేట్, ఆటోనగర్, గాజువాక వంటిల్లు జంక్షన్, నమ్మిదొడ్డి, అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రి, భీమునిగుమ్మం రైల్వేస్టేషన్, బాజీ జంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్ పొంతాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. క్యాంటీన్‌లకు ఆహారం తయారు చేయడంతోపాటు సరఫరాచేసే బాధ్యతను అక్షయప్రాతకు అప్పగించింది. కంచరపాలెంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయపాత్ర సెంట్రల్ కిచెన్‌లో వంటకాలను తయారుచేసి వాహనాల్లో అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారు. మంచి రుచి, నాణ్యత కలిగి వుండడంతో నిరుపేదలు, కూలీలే కాకుండా ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు కూడా భోజనం కోసం వీటినే ఆశ్రయిస్తున్నారు. దీంతో క్యాంటీన్లకు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.అల్పాహారం కింద ప్రతిరోజూ మూడు ఇడ్లీలు, 150 మిల్లీలీటర్ల సాంబార్, 150 గ్రాములు చట్నీ ఇస్తున్నారు. ప్రత్యామ్నాయంగా సోమవారం, గురువారాల్లో మూడు పూరీ, వంద గ్రాముల కర్రీ, మంగళ, శుక్రవారాల్లో 250 గ్రాముల ఉప్మా, మిక్చర్, సాంబార్, బుధ, శనివారాల్లో హాట్ పొంగల్, సాంబార్, మిక్చర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. మధ్యాహ్నం, రాత్రిపూట భోజనం కింద సోమవారం నుంచి శనివారం వరకూ 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల పప్పు లేదా సాంబార్, 100 గ్రాముల కూర, 75 గ్రాముల పెరుగు, పచ్చడి అందజేస్తున్నారు. అన్న క్యాంటీన్‌లకు ఆదివారం సెలవు. మిగిలిన రోజుల్లో ఉదయం ఏడున్నర నుంచి పది గంటల వరకూ అల్పాహారం, మధ్యాహ్నం 12.30 నుంచి మూడు గంటల వరకూ భోజనం, రాత్రి ఏడున్నర నుంచి తొమ్మిది గంటల వరకూ భోజనం అందుబాటులో ఉంచుతున్నారు. గత ఏడాదికాలంలో ప్రతీరోజూ సగటున 23,843 మంది చొప్పున ఏడాదిలో మొత్తం 74,62,824 మంది అన్న క్యాంటీన్‌లలో ఆకలి తీర్చుకున్నారు. 28,76,030 మంది అల్పాహారం, 29,22,631 మంది మధ్యాహ్న భోజనం, 16,64,163 మంది రాత్రివేళ భోజనం చేసినట్టు యూసీడీ పీడీ సత్యవేణి తెలిపారు.

# పెద్దేవంలో గేదెల రక్షణకు చర్యలు



తాళ్లపూడి, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్):గ్రామంలోని చూడి పశువులు, ఈనిన గేదె లను గుర్తించి యుద్ధప్రాతిపదికన వాటిని కాపాడాలని పశు సంవర్ధక శాఖా సిబ్బందికి కలెక్టరు కీర్తి చేకూరి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని పెద్దేవం గ్రామంలో గేదెల వరు స మరణాలపై కలెక్టర్ స్పందించి జమ్ముల శ్రీను, గెడ్డం మణికంఠ నివాసాల వద్ద వ్యాధి బారిన పడిన గేదెలను పరిశీలించి రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో పశు వులకు చికిత్స కొసాగింపు కొనసాగుతుందని.. ఈ మేరకు ప్రత్యేక వైద్య బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపడం జరిగిందన్నారు. గేదెల వ్యాధి నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుం టున్నామని.. రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. పశువుల పేడ పరీక్షల్లో బి.కోలి, పొట్ట జలగ వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. మరికొన్ని ల్యాబ్‌ల నుంచి రెండు మూడు రోజుల్లో ఫలితాలు వస్తాయన్నారు. పశువైద్య జీవ విజ్ఞాన పరిశోధన సంస్థ (వీబీఆర్ఐ) ప్రత్యేక నిపుణుల బృందం పర్యవేక్షణలో పశు వుల చికిత్స,వ్యాధి తీవ్రత తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమీక్షించడం జరిగిందన్నారు. పెద్దేవంలో బుధవారం రైతు జొన్నలగడ్డ సత్యనారాయణకు చెందిన గేదె మృతి చెందగా గురువారం శవ పరీక్షలు చేపట్టి.. నమూనా లను వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ పంపించారన్నారు.చనిపోయిన గేదెల యజ మానుల నివాసాల వద్ద.. గ్రామంలో నీటిని క్షుణ్ణంగా పరిశీలించి రేపటిలోగా నివేదికలు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నూర్జహాన్‌కు సూచించారు. అనంతరం రైతులు ప్రభుత్వం నుంచి గేదెల కొనుగోలుకు రుణాలు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలోని సుగంధి చెరువు శుభ్రం చేయించాలని కోరగా కలెక్టరు పరిశీ లించారు. ఆమె వెంట ఆర్డీవో రాణీ సుస్మిత, వీబీఆర్ఐ విజయవాడ కేంద్రం జేడీ డా చంద్ర మౌళి, సహాయ సంచాలకులు డా.శిరీష, జిల్లా పశుసంవర్ధక శాఖా అధికారి డా. శ్రీనివాస్, డిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సిసి ఎంపికలో విద్యార్థి మృతి



విజయనగరం కంటోన్మెంట్ సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): ఎన్‌సిసి పరుగు పందెంలో పాల్గొన్న ఇంజనీ రింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన విజయనగరంలో చోటు చేసుకుంది. తోటి విద్యార్థులు, మృతుని తల్లిదండ్రుల కథనం మేరకు పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన సాయి కిరణ్ (19) విజయనగరంలోని సీతం కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఎన్‌సిసి చేయాలనే ఆసక్తితో కళాశాలలో నిర్వహించిన ఎంపికలో పాల్గొన్నారు. అందులో భాగంగా 1.6 కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నారు. పరిగెడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే కళాశాల యాజమాన్యం, ఎన్‌సిసి సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయికిరణ్ మృతి చెందారు. తమకు న్యాయం చేయాలంటూ జిల్లా సర్వజన ఆస్పత్రి వద్ద సాయికిరణ్ తల్లి దండ్రులు, విద్యార్థులు నిరసన తెలిపారు. ఎన్‌సిసి ఎంపిక సమయంలో సరైన వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# డయేరియా విస్తరించకుండా చూడండి : సిపిఎం



-గుంటూరు : సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): గుంటూరు నగరంలో వివిధ ప్రాంతాలలో నీటి కాలుష్యం కారణంగా డయేరియా విజంభిస్తోందని, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి నగరంలో మరింత విస్తరించకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో డయేరియా బాధిత రోగులను సిపిఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ ఇప్పటికే జిజిహెచ్‌లో 33 మందికి చికిత్స పొందుతుండగా మరికొంత మందికి క్యాజువాలిటీలో వైద్యం చేస్తున్నారని అన్నారు.15వ తేదీ సాయంత్రం నుండి కేసులు నమోదవుతున్నాయని, ఇవి క్రమంగా పెరుగుతున్నాయని చెప్పారు. గతంలో పాతగుంటూరులో డయేరియాతో అనేక మరణాలు సంభవించాయని, ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌లో ఈ డయేరియా విజృంభణ చూస్తున్నామని అన్నారు. తాగునీటి పైపులైన్‌లు మురుగు కాల్వల్లో ఉన్నాయని, వర్షం నీరు ఆ పైపుల ద్వారా ప్రవహించి మురుగునీరు ప్రజలకు సరఫరా అవుతోందని అన్నారు. అధికారులు దీనికి శాశ్వతమైన పరిష్కారం చూడట్లేదని, ఇలాంటి కేసులు వచ్చిన సందర్భంలో హడావిడి చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణమే వైద్య ఆరోగ్య శాఖ వారు కదిలి ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రజలను ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని కోరారు. మురుగు కాల్వల్లోని వాటికి మరమ్మతులు చేయాలని, డయేరియా విస్తరించకుండా చూడాలని కోరారు. బాధితుల్ని పరామర్శించిన వారిలో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, నాయకులు ఎల్.అరుణ, బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, షేక్ ఖాశింవలి, ఆది నికల్సన్ ఉన్నారు.

# స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత



%పార్వతీపురం, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత ఉంటుందని, మార్గదర్శి నిర్ణయమే ముఖ్యమని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో పీ-4 బంగారు కుటుంబాల దత్తతపై వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా ప్రణాళికాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేసీ పాల్గొని మాట్లాడారు. బంగారు కుటుంబాల దత్తతకు మార్గదర్శకులు ముందుకు రావాలని కోరారు. 'ఇందులో ఎటువంటి ఒత్తిడి లేదు. వారు స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకంగానే రావచ్చు. అలాంటి వారిని మార్గదర్శిగా ఎంపిక చేస్తాం. మార్గదర్శకులకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలి. మార్గదర్శకుల ఎంపికకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. దానిని తప్పకుండా పాటించాలి. వారివల్ల బంగారు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఉద్యోగ బాధ్యతలతో పాటు సామాజిక స్పృహ కూడా ఉండాలి. బంగారు కుటుంబాలకు ఆర్థికంగా లేదా ఇతర సహాయ సహకారాలను అందించి మార్గదర్శి ఆదుకోవచ్చు. ఈ విషయంపై మార్గదర్శికి అవగాహన కల్పించి వారి పేర్లను పీ-4లో నమోదు చేయాలి.' అని అన్నారు.

# ఇద్దరు పాత నేరస్థుల అరెస్ట్




ఆలూరు, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్)::అర్ధరాత్రి వాహనాలను టార్గెట్ చేసి రాబరీకి పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను ఆలూరు పోలీసులు అరెస్టు చేశారు. ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఈనెల 5వ తేదీన అర్ధరాత్రి పట్టణంలోని అతిథి హొటల్ వద్ద జాతీయ రహదారిపై లారీని ఆపుకుని నిద్రిస్తున్న డ్రైవర్ నుంచి మొబైల్, డబ్బులు లాక్కోవడానికి ప్రయత్నించగా డ్రైవర్ ప్రతిఘటించడంతో చాకుతో దాడిచేసి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దోపిడీ కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాల మేరకు సాంకేతికతను ఉపయోగించి దర్యాప్తు చేశారు. కర్ణాటకలోని చిక్కవద్దట్టి గ్రామం, గదగ్ జిల్లాకు చెందిన షికారి ప్రేమేష్, బళ్లారి జిల్లా బసరకోడూరు గ్రామానికి చెందిన మూర్తి అనే ఇద్దరూ జల్సాలకు అలవాటు పడ్డారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో డబ్బు, సెల్‌ఫోన్‌లు దొంగతనాలు చేస్తూ రాత్రిపూట రోడ్డు పక్కన నిద్రించే లారీ డ్రైవర్లను టార్గెట్ చేస్తూ కత్తులు, రాళ్లతో దాడి చేసి దోచుకునేవారు. గతంలో కూడా పలు కేసులు కూడా నమోదయ్యాయి. కర్నూలు నాలుగో పట్టణ పోలీసస్టేషన్ పరిధిలో హత్య కేసులో ప్రధాన ముద్దాయిలుగా ఉన్నారన్నారు. ఆదోని మూడో పట్టణ పోలీసస్టేషన్‌కు సంబంధించి మూడు చోరీ కేసుల్లో కూడా వీరు ముద్దాయిగా విచారణలో తేలిందన్నారు. కడప, ఆదోని సెంట్రల్ జైలులో శిక్ష కూడా అనుభవించారని తెలిపారు. ఈ కేసును ఛేధించిన ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా, ఏఎసఐ చంద్రశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ రంగయ్య, కానిస్టేబుల్ కె.పరశురాం, సుధాకర్, వీరాంజి, రమేషను సీఐ అభినందించారు.

# లారీ ఢీకొని రెండు ఎద్దుల మృతి


సీతానగరం, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): కాశయ్యపేట పెట్రోల్ బంకు వద్ద వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు నాటు బండ్లను లారీ ఢీకొట్టింది. దాంతో రెండు ఎద్దు మృతిచెందాయి. ఈ ఘటనలో ముందు వెళ్తున్న నాటు బండి యజమాని తిరుపతిరావుకు చెందిన ఒక ఎద్దు, రెండో నాటు బండి యజమాని పెంట పోలినాయుడుకు చెందిన మరొక ఎద్దు ఘటన స్థలంలోనే మృతిచెందాయి. జగ్గునాయుడుపేట నుంచి ఇసుక తీసుకుని వెళ్లడా నికి సీతానగరం నుంచి నాటు బండ్లు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. పార్వ తీపురం వైపు నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో తిరుపతిరావుకు చిన్న గాయాలు తగలడంతో పార్వతీపురం కేంద్రాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. తిరుపతి రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.రాజేష్ కేసు నమోదు చేశారు.

## ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలి



హైదరాబాద్ సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): ప్రజల్లో శాఖకు మంచిపేరు తీసుకురావడంతో పాటు ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్లతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇటీవల శాఖలో నూతనంగా ఎన్నికైన ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిని ఒప్పించి శాఖలో ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న సర్వీస్ రూల్స్‌ను ఆమోదించుకుని పదోన్నతులు ఇచ్చామన్నారు. ఆమోదయోగ్యమైన సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేస్తానన్న మంత్రి ఉద్యోగులంతా మరింత ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. పదోన్నతులు కల్పించినందుకు అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఎన్.శ్రీను, ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి పి.శరత్, కోశాధికారి మహేందర్, ఉపాధ్యక్షులు కె.సంధ్య, వేణు, ప్రదీపరెడ్డి, సంయుక్త కార్యదర్శులు నవీన్, కిషన్, అరుణ్‌రెడ్డితో పాటు పలువురు ఇంజినీర్లు ఉన్నారు.

## బాచుపల్లి జీరో..
## వేలంలో ఒక్క ప్లాట్ కూడా అమ్ముడుపోలే




హైదరాబాద్ సిటీ సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ ప్లాట్లు వేలం వేస్తోందంటే జనం భారీగా పోటీ పడతారు. స్థలాలు నిమిషాల్లోనే అమ్ముడై.. సంస్థకు రూ.కోట్లు సమకూరతాయి. కానీ ఈసారి అలా జరగలేదు. రెండున్నరేళ్ల తర్వాత తుర్కయంజాల్‌లో ప్లాట్ల వేలం చేపట్టగా.. రెండే అమ్ముడుపోయాయి. బాచుపల్లి లేఔట్‌లో ప్లాట్ల వేలం జరగ్గా.. ఒక్కటి కూడా అమ్ముడుపోలేదు.గజం కనీస ధర రూ.70వేలుగా నిర్ణయించడం, సరైన ప్రచారం, అవగాహన కల్పించకపోవడమే దీనికి ప్రధాన కారణాలని తెలుస్తోంది. తుర్కయంజాల్‌లో లేఔట్‌లోని 12 ప్లాట్లకు వేలం వేస్తే కేవలం రెండే అమ్ముడుపోయాయి. అందులో ఒక ప్లాట్ గజం రూ.1.10 లక్షలు పలికింది. అమ్ముడుపోని ప్లాట్లలో అత్యధికంగా ప్లాట్ల సైజ్ సక్రమంగా లేకపోవడం, కనీస ధర గజానికి రూ.65వేలు నిర్ణయించడంతో స్పందన లేదు. %మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లి లేఔట్‌ను హెచ్ఎండీఏ అభివృద్ధి చేయగా.. రెండున్నరేళ్ల క్రితం వందకు పైగా ప్లాట్లను విక్రయించారు. గురువారం 70 ప్లాట్లకు ఈ-వేలం నిర్వహిస్తే ఒక్క ప్లాట్ కూడా అమ్ముడుపోలేదు. నివాసాల మధ్య ఉన్న లేఔట్‌లోని ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతాయని హెచ్ఎండీఏ అధికారులు గజం కనీస ధరను రూ.70వేలు నిర్ణయిస్తే.. ఒక్కరూ కొనుగోలుకు ముందుకు రాలేదు.బాచుపల్లిలో లేఔట్‌ను ప్రకటించిన తర్వాత మూడు విడతలుగా దాదాపు 180 ప్లాట్ల వరకు విక్రయించారు. అప్పట్లో గజం కనీస ధర రూ.25 వేలు మాత్రమే. దాంతో జనం పోటీపడి కొనుగోలు చేశారు. మూడు విడతల్లో బాచుపల్లిలో ప్లాట్లను విక్రయిస్తే అత్యధికంగా గజం రూ.68వేలు, సగటున రూ.59,149 పలికింది. అప్పట్లో పలికిన గజం అత్యధిక ధరను ఆధారంగా చేసుకొని ఇప్పుడు కనీస ధరను నిర్ణయించడం గమనార్హం. తుర్కయంజాల్‌లో గతంలో గజం కనీస ధర రూ.25వేలు మాత్రమే.. ప్రస్తుతం రూ.65వేలు నిర్ణయించారు.


## సద్దుల బతుకమ్మను
## సెలవుగా ప్రకటించాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో మహిళలు పవిత్రంగా జరుపుకునే సద్దుల బతుకమ్మను ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి(టీజీఈజేఏసీ) నేతలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కోరారు. ఈ నెల 30న జరుపుకునే బతుకమ్మ పండుగకు సెలవు ఇవ్వాలని కోరుతూ టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, కో-చైర్మన్ కటకం రమేష్ తదితరులు సచివాలయంలో సీఎసను కలిసి వినతి పత్రం ఇచ్చారు.

## కూతుర్ని చంపి తండ్రి ఆత్మహత్య

### ప్రమాదంలో వికలాంగురాలైన భార్య
### పెరిగిన అప్పులు.. దిక్కు తోచక ఆత్మహత్య



%పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్): అధికమైన ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ తండ్రి.. కూతుర్ని చంపి, తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బహదూర్‌పల్లి వాసి అశోక్ (50), భార్య సోని, కూతురు దివ్య (5)లతో కలిసి ఇందిరమ్మ కాలనీలో అద్దెకుంటూ వంట మనిషిగా జీవిస్తున్నాడు. మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొట్టడంతో భార్య సోనీ ఎడమ కాలు తీసేయడంతో ఇంట్లోనే ఉంటుండగా, అశోక్‌కూ ఏ పని దొరకక ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తితో 3 రోజుల క్రితం రాత్రి ఇంట్లో గ్యాస్ లీక్ చేసి.. కుటుంబ సభ్యులంతా చనిపోదామనుకున్నాడు. భార్య బయటికొచ్చి కేకలేయడంతో చుట్టు పక్కల వారి సాయంతో గ్యాస్ సిలిండర్‌ను ఆఫ్ చేశారు. మరునాడు కూతురు దివ్యతో కలిసి బయటకెళ్లిన అశోక్.. మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాల వెనుక చెరువులో శవాలై తేలారు. మృతులు ఇందిరమ్మ కాలనీ వాసులని స్థానికులు చెప్పడంతో అశోక్ భార్య సోనికి సమాచారమిచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మృతదేహాలను పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు



కొత్తగూడెం, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్):ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాకు చెందిన ఆరుగురు మావోయిస్టులు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట లొంగిపోయారు. వీరిలో బస్తర్ దక్షిణ ప్రాంత ఏరియా కమిటీలో సభ్యుడిగా పనిచేస్తున్న మడకం దేవా అలియాస్ దినేశ్, పార్టీ మెంబర్ జోగా మడివి, మిలిషీయా సభ్యులు ఉన్నారు. ఆదివాసీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి మావోయిస్టులు ఆకర్షితులయి, జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా లొంగిపోయిన వారికి తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల చెక్కును పోలీసులు అందజేశారు.

## రంగుమారిన పొలాలు.. ఆందోళనలో రైతులు



సంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్):జిల్లాలోని గుమ్మడిదల మండలం బొంతపల్లిలోని పొలాలు, చెరువు రంగు మారటం తీవ్ర కలకలం రేపుతోంది. గ్రామంలో గత రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో నల్లకుంట చెరువులో భారీగా రసాయనాలు చేరాయి. ప్రమాదకర రసాయనాలతో చెరువు, పొలాలు రంగు మారిపోయాయి. నల్లకుంట చెరువు పూర్తిగా ఎరుపు రంగులోకి మారిపోయింది. దీంతో చుట్టు పక్కల ఉన్న వందల ఎకరాలలో పంట పొలాల్లో ఎరుపు రంగునీరు వచ్చి చేరింది. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులకు తమ పొలాలు ఎరుపు రంగుతో దర్శనమివ్వడంతో షాక్‌కు గురయ్యారు.రసాయనాలు కలిసిన నీటి వల్ల తమ పొలాలకు ఎలాంటి పరిస్థితి వస్తుందో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా పరిశ్రమల నుంచి రసాయనాలు వదలడమే కారణమన అన్నదాతలు ఆరోపిస్తున్నారు.వర్షం పడిన సమయంలో పరిశ్రమల నుంచి తరచుగా రసాయనాల విడుదల అవుతాయి. అయినప్పటికీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోని పరిస్థితి. గత రాత్రి భారీ వర్షం పడటంతో పరిశ్రమలు రసాయనాలు విడుదల చేయడంతో నల్లకుంట చెరువుతో పాటు తమ పొలాలు కూడా రంగు మారాయంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

## ఆయిల్ ట్యాంకర్ ఢీ..
## మహిళ మృతి



సంగారెడ్డి, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్):సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి క్రాస్ రోడ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారి దాటుతున్న ఒక మహిళను భారీ ఆయిల్ ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో సదరు మహిళ ఆయిల్ ట్యాంకర్ టైర్ల కింద పడి.. ఆమె మృతదేహం నుజ్జు నుజ్జు అయింది. స్థానికులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. ముక్కలైన ఆ మహిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి.. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతురాలును గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రహదారి రక్తసిక్తం



భూత్పూర్, సెప్టెంబర్ 19 (సందేశం టైమ్స్):జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామ శివారులో నాగకర్నూల్ జాతీయ రహదారిపైన ఉదయం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండలం దొంతికుంట తండాకు చెందిన పాత్లావత్ సక్రీ(36), అదే మండలంలోని గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన గుంపల్లి వంశీ(23), మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని పోతులమడుగు గ్రామానికి చెందిన సౌదరి నర్సిహారెడ్డి (57) కలిసి ఖిల్లాఘనపూర్ నుంచి ఆటోలో భూత్పూర్‌కు బయలుదేరారు. కొత్తమొల్గర గ్రామ శివారులోని తుల్జాభవానీ తండా దగ్గర భూత్పూర్ నుంచి బిజినేపల్లి వైపునకు కిరాణ సామానులతో వెళుతున్న మరో ఆటో ఎదురుగా వచ్చింది. దీంతో ఆ రెండు ఆటోలు బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఘనపూర్ నుంచి భూత్పూర్‌కు వెళుతున్న ఆటోలో నలుగు ప్రయాణికులు ఉన్నారు. వారిలో వంశీ, నర్సింహారెడ్డి సంఘటనా స్థలంలోనే తలలు పగిలి మృతి చెందారు. పాత్లావత్ సక్రీ అనే మహిళను చికిత్స కోసం అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అయితే మృతురాలు సక్రీ కి భర్త, ఇద్దరు కూతుళ్లు, ఒక కూమారుడు ఉన్నారు. ఆమె తన ఇద్దరు కూతుళ్లను జడ్చర్లలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివిస్తోంది. దసర పండుగ సెలవుల సందర్భంగా పిల్లలిద్దరినీ తీసుకురావడానికి వెళుతూ మృతి చెందింది. అదే విధంగా వంశీ అనే యువకుడు ఖిల్లాఘనపూర్ లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. భూత్పూర్‌కు వస్తుండగా ఈ ప్రమాదంలో దుర్మరణం చెందాడు. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉండే నర్సిహారెడ్డి సొంత పనుల నిమిత్తం ఖిల్లాఘనపూర్‌కు వచ్చి వెళుతుండగా మృతి చెందాడు. అతని భార్య రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఒక కుమారుడు ఉన్నాడు.




# క్రీడావార్తలు




## కుర్రాళ్లకు సదవకాశం

ఆసియాకప్ లీగ్ పోటీలు శుక్రవారంతో ముగియనున్నాయి. భారత్-ఒమన్ జట్ల మధ్య జరిగే గ్రూప్-ఎ చివరి లీగ్ మ్యాచ్‌తో ఈ ఏడాది ఆసియాకప్ లీగ్ పోటీలు ముగుస్తాయి. ఈ గ్రూప్ నుంచి భారత్, పాకిస్తాన్ జట్లు ఇప్పటికే సూపర్-4కు చేరగా.. గ్రూప్-బి నుంచి శ్రీలంక దాదాపు సూపర్-4 బెర్త్‌ను కొట్టింది. ఆసియాకప్ టోర్నీలో భారతజట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలి లీగ్‌లో యుఎఇపై 9వికెట్ల తేడాతో, పాకిస్తాన్‌పై 7వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారతజట్టు చివరి లీగ్ మ్యాచ్‌ను విజయంతో ముగించాలని చూస్తోంది. బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణిస్తున్న భారతజట్టును నిలువరించడంతో ఒమన్‌కు కష్టమే. ఈ లీగ్‌లో ఆ జట్టు ఆడిన రెండు మ్యాచుల్లోనూ చిత్తుగా ఓడి టోర్నీనుంచి ఇప్పటికే నిష్క్రమించింది.



నబీ చివరి ఓవర్లో ఐదు సిక్సర్లు..

సీనియర్ బ్యాటర్, మాజీ కెప్టెన్ మహ్మద్ నబీ ఇన్నింగ్స్ చివరి ఓవర్లు ఏకంగా ఐదు సిక్సర్లు బాది ఆఫ్ఘనిస్తాన్ జట్టు భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. శ్రీలంక స్పిన్నర్ వెల్లలగే వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఐదు సిక్సర్లకు తోడు ఒక నోబ్, ఒక రన్ వచ్చింది. ఆ ఓవర్లో ఆఫ్ఘన్ జట్టు 32 పరుగులు రాబట్టింది. దీంతో ఆఫ్ఘన్ జట్టు 19ఓవర్లు ముగిసేసరికి 7వికెట్ల నష్టానికి 137పరుగులతో ఉన్న ఆఫ్ఘన్ జట్టు 20ఓవర్లు ముగిసేసరికి 8వికెట్ల నష్టానికి 169పరుగుల చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘన్‌కు శుభారంభం దక్కలేదు. గుర్బజ్(14), సిద్ధిఖుల్లా(18), కరీమ్(1), రసూల్ (9), అజ్మతుల్లా(6) నిరాశపరిచారు. దీంతో ఆ జట్టు 79పరుగులకే 6వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో రషీద్ ఖాన్(24), నబీ కలిసి జట్టును ఆదుకున్నారు. నబీ 22 బంతుల్లో 3ఫోర్లు, 6సిక్సర్ల సాయంతో 60 పరుగులు చేసి చివర్లో రనౌట య్యాడు. శ్రీలంక బౌలర్లు తుషారాకు నాలుగు, ఛమీరా, వెల్లలాగే, శనకకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో భాగంగా లంక జట్టు 10ఓవర్లు ముగిసే సరికి 2వికెట్ల నష్టానికి 82పరుగులు చేసింది.

## సూపర్ ప్రాక్టీస్ కావాలని



అబుధాబి: ఆసియాకప్‌లో అజేయంగా దూసుకెళుతున్న టీమిండియా గ్రూప్ 'ఎ'లో తమ ఆఖరి మ్యాచ్ ఆడనుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఒమన్‌తో తలపడనుంది. అయితే ఈ నామమాత్రపు మ్యాచ్‌ను సూపర్-4కు సన్నాహకంగా ఉపయోగించుకోవాలని భారత్ భావిస్తోంది. టాపార్డర్ విశేషంగా రాణించడంతో ఇప్పటిదాకా మిడిల్, లోయరార్డర్ బ్యాటర్లకు పెద్దగా అవకాశం దక్కలేదు. ఆడిన రెండు మ్యాచ్‌లు కూడా ఏకపక్షంగానే ముగిశాయి. టాప్-8లోని ముగ్గురు ప్లేయర్లు అసలు బరిలోకి దిగలేదు. ఈ ఆదివారం మరోసారి పాకిస్థాన్‌తో తలపడబోతున్న తరుణంలో బ్యాటర్లకు క్రీజులో తగినంత సమయం లభించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అందుకే టాస్ గెలిస్తే బ్యాటింగ్ వైపు మొగ్గుచూపవచ్చు. మిడిలార్డర్‌లో శాంసన్, అక్షర్ అసలు బరిలోకే దిగలేదు. మరోవైపు కోచ్ గంభీర్ ఈ మ్యాచ్ కోసం పెద్దగా ప్రయోగాలు చేయాలనుకోవడం లేదు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతినిచ్చి మరో పేసర్ అర్ష్‌దీపను పరీక్షించవచ్చు. అబుధాబి పిచ్ పేసర్లకు అనుకూలించనుండడంతో హర్షిత్‌ను ఎంపిక చేసినా ఆశ్చర్యం లేదు. అటు ఒమన్ ముందుగా బ్యాటింగ్‌కు దిగితే భారత బౌలర్లను ఎదుర్కొని పూర్తి ఓవర్లు ఆడగలదా అంటే సందేహమే. ఆ జట్టు పాక్‌పై 67, యూఏఈపై 130 రన్స్ మాత్రమే చేయగలిగింది.

## అంతిమ్‌కు కాంస్యం



జగ్రెబ్: భారత యువ రెజ్లర్ అంతిమ్ పంగల్ ప్రపంచ చాంపియన్‌షిపలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకొంది. గురువారం జరిగిన 53 కిలోల కాంస్య పోరులో అంతిమ్ 9-1తో ఎమ్మా జొన్నా డినైస్ మల్మగ్రెన్ (స్వీడన్)పై గెలిచింది. 21 ఏళ్ల అంతిమ్‌కు ఇది రెండో ప్రపంచ పతకం. 2023 టోర్నీలోనూ ఆమె కాంస్యం నెగ్గింది. దీంతో వినేశ్ ఫొగట్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిపలో రెండు పతకాలు నెగ్గిన భారత రెజ్లర్‌గా అంతిమ్ నిలిచింది. ఇక, మరో భారత రెజ్లర్ మనీష 62 కిలోల విభాగం రెపిచేజ్ రౌండ్‌లో ఓటమిపాలై కాంస్య పోరుకు దూరమైంది.

## వీడియో లీక్‌పై ఐసీసీ సీరియస్..
## పాక్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే ఛాన్స్

ఆసియా కప్‌లో నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ పాక్ క్రికెట్ బోర్డుకు ఐసీసీ ఈమెయిల్ చేసింది. ఈ ఉల్లంఘనలపై అధికారిక పరిశీలన ప్రారంభమైందని తెలిపింది. అయితే, పాక్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అంశాన్ని కూడా ఐసీసీ పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది %ఇటీవలి మ్యాచ్‌లో పాక్‌తో భారత క్రీడాకారులు కరచాలనం చేయకపోవడం కాంట్రవర్సీకి దారి తీసిన విషయం తెలిసిందే. ఇందులో రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్ తప్పు కూడా ఉందని పాక్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో యూఏఈపై విజయం తరువాత పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా, టీమ్ మేనేజర్ నవీద్ అక్రమ్ చీమా, మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్ సమావేశమయ్యారు. ఇందుకు సంబంధించి వీడియోను పీసీబీ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. నో హ్యాండ్ షేక్ వివాదంలో రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్ తమకు క్షమాపణలు చెప్పినట్టు కూడా వెల్లడించింది. ఇదే ప్రస్తుతం వివాదానికి దారి తీసినట్టు తెలుస్తోంది వీడియో వైరల్ కావడంతో ఐసీసీ స్పందించింది. పైక్రాఫ్ట్ తాను తప్పు చేసినందుకు క్షమాపణలు చెప్పలేదని వివరణ ఇచ్చింది. సమాచార మార్పిడిలో లోపంపై మాత్రమే ఆయన స్పందించినట్టు పేర్కొంది. తమ అంతర్గత విచారణలో పైక్రాఫ్ట్ తప్పేమీ లేదన్న విషయం తేలిందని చెప్పింది. అయితే, పైక్రాఫ్ట్ సమావేశం తాలూకు వీడియోను రిలీజ్ చేయడం మాత్రం నిబంధనలను ఉల్లంఘించడమేనని ఐసీసీ భావిస్తోంది. ఈ అంశంపై తన అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ పాక్ బోర్డుకు లేఖ రాసింది %పాక్‌తో మ్యాచ్ సందర్భంగా భారత క్రీడాకారులు ప్రత్యర్థి టీమ్ జట్టు సభ్యులతో కరచాలనం



చేయని విషయం తెలిసిందే. మ్యాచ్ మొదలు చివరి వరకూ అంటీముట్టనట్టుగా వ్యవహరించారు. టాస్ సమయంలో కూడా పాక్ ప్లేయర్లతో కరచాలనం చేయొద్దన్న భారత క్రీడాకారుల నిర్ణయాన్ని మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్ పాక్ జట్టుకు చేరవేశారు. దీంతో, పాక్ కెప్టెన్ మ్యాచ్ సమయంలో భారత జట్టు కెప్టెన్‌కు దూరంగా ఉన్నాడు. ఈ ఉదంతంపై అభ్యంతరం వ్యక్తం చేసిన పీసీబీ.. మ్యాచ్ రెఫరీని తొలగించాలని డిమాండ్ చేసింది. అయితే, ఐసీసీ మాత్రం ఈ డిమాండ్స్‌ను తోసిపుచ్చింది. ఇక పైక్రాఫ్ట్ వీడియోను అనుమతి లేకుండా విడుదల చేయడంపై ఐసీసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

## రెజ్లింగ్‌లో నారాయణ హవా




జమ్మూలో జరిగిన జాతీయ గ్రాప్లింగ్ (రెజ్లింగ్) చాంపియన్‌షిపలో నారాయణ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు 3 స్వర్ణాలతో సత్తా చాటారు. అండర్-11 కేటగిరిలో ఆయుష్ ఠాకూర్ 2 పసిడి పతకాలు, అండర్-15లో వైష్ణవి ఠాకూర్ ఓ స్వర్ణం గెలిచారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డా. సింధూర నారాయణ, శరణి నారాయణ.. విద్యార్థులను అభినందించారు. వీళ్ల విజయం.. తమ సంస్థలో మరింతమంది క్రీడల్లో ప్రతిభ చాటేందుకు స్ఫూర్తినిస్తుందన్నారు.

## విఫలమైన నీరజ్ మెరిసిన సచిన్

టోక్యో: జావెలిన్ వీరుడు నీరజ్ చోప్రా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిపలో నిరాశపరిచాడు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన నీరజ్.. టైటిల్ నిలబెట్టుకోవడంలో విఫలమవడమే గాకుండా కనీసం పోడియం ఫినిష్ కూడా చేయలేకపోయాడు. గురువారం జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ ఒక్కసారి కూడా 85 మీటర్ల మార్క్‌ను అందుకోలేకపోయాడు. మొత్తం 12 మంది పోటీపడ్డ ఫైనల్స్‌లో నీరజ్.. జావెలిన్‌ను 84.03 మీటర్లు మాత్రమే విసిరి ఏకంగా ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యాడు. హాట్ ఫేవరెట్‌గా పోటీపడ్డ నీరజ్ మొదటి ప్రయత్నంలో జావెలిన్‌ను 83.65 మీటర్ల దూరం విసిరాడు. రెండో రౌండ్‌లో 84.03 మీటర్లు విసిరిన చోప్రా.. మూడో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. నాలుగో రౌండ్‌లో 82.86 మీటర్లతో సరిపెట్టుకున్న నీరజ్.. ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేసి పతక రేసు నుంచి నిష్క్రమించాడు. అయితే నీరజ్ నిరాశపరిచిన చోట.. మరో భారత త్రోయర్ సచిన్ యాదవ్ తన అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అంచనాలకు మించి రాణించిన సచిన్.. అత్యుత్తమంగా 86.27 మీటర్లు విసిరి నాలుగో స్థానంతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. నీరజ్ కంటే




ఎన్నోరెట్లు అద్భుతంగా రాణించిన సచిన్.. కేవలం 40 సెంటీ మీటర్ల తేడాతో కాంస్య పతకం చేజార్చుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే అత్యుత్తమ ప్రదర్శన చేసి పతకంపై ఆశలు రేపిన సచిన్.. ఆఖరి ప్రయత్నంలో 80.95 మీటర్లే త్రో చేసి నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు. మూడో స్థానంలో నిలిచిన అమెరికా త్రోయర్ కుర్టిస్ థాంప్సన్ 86.67 మీటర్లతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఇక, ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన కిషోర్న్ వాల్కాట్ అందరి కంటే అత్యుత్తమంగా 88.16 మీటర్లు త్రో చేసి స్వర్ణం ఎగరేసుకుపోయాడు. గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ 87.38 మీటర్ల ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం అందుకున్నాడు. ఇటీవల డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన జర్మన్ స్టార్ జులియన్ వెబర్ (86.11 మీ.) ఇక్కడ ఐదో స్థానానికి పడిపోయాడు. ఇక, నీరజ్‌కు పోటీగా భావించిన పాకిస్థాన్ స్టార్, పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ కూడా దారుణంగా విఫలమయ్యాడు. ఫైనల్లో పూర్తిగా తేలిపోయిన అర్షద్.. 82.75 మీటర్లు త్రో చేసి ఏకంగా పదో స్థానంలో నిలవడం గమనార్హం.గతంలో ఎన్నడూ లేనంతగా నీరజ్ ఈసారి దారుణంగా విఫలమవడానికి కారణం అతను గాయానికి గురవడమేనని తెలుస్తోంది. టోర్నీకి రెండు వారాల ముందు నుంచే నీరజ్ వెన్నునొప్పితో బాధపడుతున్నాడని భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫఐ) అధికారి ఒకరు వెల్లడించారు. ఒకరకంగా వెన్నునొప్పి కూడా తన ప్రదర్శనపై ప్రభావం చూపిందని ఫైనల్స్ ముగిసిన అనంతరం నీరజ్ తెలిపాడు. కాగా, గత ఏడేళ్లలో పోటీపడిన ప్రతి ఈవెంట్‌లోనూ పతకం గెలిచిన 27 ఏళ్ల నీరజ్.. ఓ టోర్నీలో పతకం లేకుండా రావడం ఇదే మొదటిసారి. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించిన నీరజ్.. గత పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గాడు. ఇక, 2022 ప్రపంచ చాంపియన్‌షిపలో రజతం గెలిచిన నీరజ్.. గత టోర్నీ (2023)లో పసిడి సాధించాడు.ప్రపంచ చాంపియన్‌షిపలో నాలుగోస్థానంలో నిలిచి అబ్బురపరిచిన 25 ఏళ్ల సచిన్ యాదవ్..

## అఫ్ఘాన్ అవుట్




అబుధాబి: ఆసియాకప్‌లో అఫ్ఘానిస్థాన్ పోరాటం ముగిసింది. చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో గురువారం శ్రీలంకతో పోరులో ఆరు వికెట్ల తేడాతో పోరాడి ఓడింది. ఈ ఫలితంతో గ్రూప్ 'బి' నుంచి లంకతో పాటు బంగ్లాదేశ్ కూడా సూపర్-4లో అడుగుపెట్టింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు సాధించింది. 79/6 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును చివర్లో నబీ (22 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 60) ఆదుకున్నాడు. ఆఖరి ఓవర్‌లో వరుసగా ఐదు సిక్సర్లతో వణికించాడు. పేసర్ తుషారకు 4 వికెట్లు దక్కాయి. ఛేదనలో లంక 18.4 ఓవర్లలో 171/4 స్కోరు చేసి నెగ్గింది.

# బిజినెస్



## ఫోన్‌పే, పేటీఎం, క్రెడ్‌తో అద్దె చెల్లింపులకు గుడ్‌బై..ఆర్బీఐ కొత్త రూల్స్

మీరు ఫోన్‌పే, క్రెడ్ లేదా పేటీఎం యాప్‌లతో క్రెడిట్ కార్డ్ ద్వారా అద్దె చెల్లిస్తున్నారా? అయితే, ఇది మీకు షాకింగ్ న్యూస్. ఎందుకంటే ఈ ప్లాట్‌ఫామ్‌లు క్రెడిట్ కార్డ్‌తో అద్దె చెల్లింపులను నిలిపివేశాయి. ఎందుకంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా తీసుకొచ్చిన కొత్త నిబంధనల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నాయి.

ఏం జరిగింది?

ఆర్బీఐ కొత్తగా పేమెంట్ అగ్రిగేటర్ రూల్స్ జారీ చేసింది. ఈ రూల్స్ ప్రకారం ఫోన్‌పే, క్రెడ్, పేటీఎం వంటి యాప్‌లు తమ ప్లాట్‌ఫామ్‌లలో అద్దె చెల్లింపుల కోసం క్రెడిట్ కార్డ్‌ని ఉపయోగించడానికి ముందు, ఆయా ఓనర్ల %ఖ్జ (ఖఅశీష్ శీబతీ జబర్‌శీఎవతీ%) వెరిఫై చేయాల్సి ఉంటుంది. అంటే ల్యాండ్‌లార్డ్‌ల %ఖ్జ% గుర్తింపు వివరాలను సేకరించి, వాటిని వెరిఫై చేయడం. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న, క్లిష్టమైన ప్రాసెస్. అందుకే, ఈ యాప్‌లు వెంటనే క్రెడిట్




కార్డ్‌తో అద్దె చెల్లింపులను ఆపేశాయి.

నిజంగానే ఈ సర్వీస్ తాత్కాలికంగా నిలిచిపోయింది. కొత్త రూల్స్ వచ్చిన రెండు రోజుల్లోనే ఈ యాప్‌లు సర్వీస్‌ను సస్పెండ్ చేశాయి. అయినా, ఈ రూల్స్ పాటించడానికి ఈ ఏడాది చివరి వరకు టైమ్ ఉన్నా, రెగ్యులేటరీ ప్రెజర్ వల్ల వెంటనే యాక్షన్ తీసుకున్నాయని ఓ నివేదిక తెలిపింది.

ఎందుకు ముఖ్యం?

ఫోన్‌పే, క్రెడ్, పేటీఎం వంటి యాప్‌లు అద్దె చెల్లింపులకు క్రెడిట్ కార్డ్ ఆప్షన్‌ను ఆఫర్ చేయడంలో ముందుండేవి. ముఖ్యంగా క్రెడ్, ఫోన్‌పేలు ఈ సర్వీస్‌లో టాప్‌లో ఉన్నాయి. క్రెడిట్ కార్డ్‌తో అద్దె చెల్లిస్తే, యూజర్లకు రివార్డ్ పాయింట్స్, క్యాష్‌బ్యాక్ వంటి బెనిఫిట్స్ వచ్చేవి. ఇప్పుడు ఈ సర్వీస్ ఆగిపోవడంతో చాలా మంది యూజర్లు నిరాశ చెందుతున్నారు. అంతేకాదు నోబ్రోకర్, హౌసింగ్ వంటి ఇతర ప్లాట్‌ఫామ్‌లు కూడా త్వరలో ఈ సర్వీస్‌ను నిలిపివేయొచ్చని సమాచారం.

ఇప్పుడు ఏం చేయాలి?

ఇప్పుడు క్రెడిట్ కార్డ్‌తో అద్దె చెల్లించలేకపోతే, ఇతర ఆప్షన్స్ ఏమైనా ఉన్నాయా అంటే బ్యాంక్ ట్రాన్స్‌ఫర్, %ఖ్రా×%, లేదా నేరుగా క్యాష్ ద్వారా చెల్లించే అవకాశం ఉంది. కానీ, ఈ ఆప్షన్స్‌లో క్రెడిట్ కార్డ్‌లాంటి రివార్డ్స్ రావు. కొన్ని యాప్‌లు ఈ రూల్స్‌కి అనుగుణంగా %ఖ్జ% ప్రాసెస్‌ని స్ట్రీమ్‌లైన్ చేసి, మళ్లీ సర్వీస్‌ని స్టార్ట్ చేసుకోవచ్చు. కానీ, అది ఎప్పుడు జరుగుతుందో తెలియదు.

ఈ రూల్స్ ఎందుకు వచ్చాయి?

ఆర్బీఐ ఈ కొత్త రూల్స్ తెచ్చింది ఎందుకంటే, పేమెంట్ అగ్రిగేటర్స్ ద్వారా జరిగే ట్రాన్సాక్షన్స్‌లో ట్రాన్స్‌పరెన్సీ, సెక్యూరిటీ పెంచడానికి. అద్దె ఓనర్ల %ఖ్జ% చేయడం వల్ల, ఎవరికి పేమెంట్స్ వెళ్తున్నాయో స్పష్టత తెలుస్తుంది. ఇది ఫ్రాడ్‌ని తగ్గించడానికి, డబ్బు లావాదేవీలను రెగ్యులేట్ చేయడానికి హెల్ప్ చేస్తుంది. కానీ, ఈ ప్రాసెస్ యాప్‌లకు ఖర్చుతో కూడుకున్నది, టైమ్ తీసుకునే పని. అందుకే, వాళ్లు వెంటనే సర్వీస్‌ని ఆపేశారు. ఈ యాప్స్ ద్వారా రెంట్ పేరుతో అనేక మందికి మనీ ట్రాన్స్ ఫర్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## నష్టాల్లో స్టాక్ మార్కెట్ అదానీ గ్రూప్ షేర్ల జోరు..!

బిజినెస్ : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే శుక్రవారం నష్టాల్లో కదలాడుతున్నాయి. గత రెండు రోజులుగా లాభాల్లో ఉన్న మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఈ రోజు ఉదయం 9 గంటల 30 నిముషాల సమయానికి నిఫ్టీ 58 పాయింట్లు తగ్గి 25,364కు చేరింది. సెన్సెక్స్ 243 పాయింట్లు నష్టపోయి 82,773 వద్ద ట్రేడవుతోంది.

ఏ షేర్లు ఎలా అంటే

నిఫ్టీ సూచీలో కొన్ని షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. వాటిలో శ్రీరామ్ ఫైనాన్స్, జియో ఫైనాన్షియల్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, లార్సెన్ అండ్ టూబ్రో, హీరో మోటార్‌కార్ప్ లిమిటెడ్ ఉన్నాయి. అయితే, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్, టైటాన్ కంపెనీ, హిందాల్కో షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి.

జోరందుకున్న అదానీ గ్రూప్ షేర్లు

%మరోవైపు, అదానీ గ్రూప్‌కు సంబంధించిన పరిణామాలు మార్కెట్‌ను కదిలిస్తున్నాయి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా గౌతమ్ అదానీకి క్లీన్‌చిట్ ఇచ్చింది. అదానీ కంపెనీలు షేర్ల ధరలను కత్రిమంగా



పెంచేందుకు అవకతవకలు జరిగాయని అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు దొరకలేదని స్పష్టం చేసింది. ఈ పరిణామంతో అదానీ గ్రూప్ షేర్లు జోరందుకున్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ టోటల్ గ్యాస్ సహా పలు అనుబంధ సంస్థల షేర్లు ఒక దశలో 10 శాతం వరకు పెరిగాయి.

## పెరిగిన ధరలకు బ్రేక్..భారీగా తగ్గిన బంగారం, వెండి




నేడు బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి గుడ్ న్యూస్. ఎందుకంటే సెప్టెంబర్ 19, 2025న ఉదయం 6 గంటల సమయంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు రూ. 1,11,160కి చేరింది. ఇది నిన్నటి ధరలతో పోలిస్తే దాదాపు రూ. 540 తగ్గినట్లు కనిపిస్తోంది. %22 క్యారెట్ పసిడి 10 గ్రాములకు రూ. 1,01,890గా ఉంది. ఇక వెండి ధరల్లో మరింత ఆసక్తికరంగా మార్పు వచ్చింది. హైదరాబాద్, కేరళలో కేజీ వెండి రూ. 4,000 తగ్గి రూ. 1,40,900కి చేరింది. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. దేశంలో 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు చాలా నగరాల్లో రూ. 1,11,160 నుంచి రూ. 1,11,480 మధ్య ఉంది. హైదరాబాద్‌లో రూ. 1,11,160, ముంబై, కేరళ, పూణే, కోల్‌కతాలో కూడా ఇదే ధర. ఢిల్లీలో రూ. 1,11,310, చెన్నైలో రూ. 1,11,480గా ఉంది. ఇక్కడ మార్కెట్ ప్రీమియం కొంచెం ఎక్కువగా ఉంది. 22 క్యారెట్ పసిడి విషయంలో హైదరాబాద్‌లో రూ. 1,01,890, ముంబై, పూణే, కోల్‌కతా, కేరళలో కూడా ఇలాంటి ధరలే ఉన్నాయి. చెన్నైలో రూ. 1,02,190గా కలదు. ఈ తగ్గుదల వెనుక అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ బలహీనత, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేటు నిర్ణయాలు సహా పలు అంశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వెండి ధరలు మాత్రం భారీగా తగ్గిపోయాయి. నిన్నటి ధరతో పోల్చితే అనేక నగరాల్లో కిలో వెండి ధర రూ. 4 వేలు తగ్గింది. ఈ క్రమంలో హైదరాబాద్, చెన్నై, కేరళలో కేజీ వెండి రేటు రూ. 1,40,900, ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, కేరళ, పూణే, వడోదరలో రూ. 1,30,900గా ఉంది. ఈ భారీ తగ్గుదల వెనుక అంతర్జాతీయ సిల్వర్ మార్కెట్‌లో సప్లై పెరగడం, డిమాండ్ తగ్గడం సహా పలు అంశాలు కారణాలుగా ఉన్నాయని నిపుణులు అంటున్నారు.

## ఈపీఎఫ్ఓ సభ్యుల కోసం స్మార్ట్ విధానం.. ఒకే లాగిన్‌తో అనేక సేవలు

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సభ్యులకు గుడ్ న్యూస్. ఇప్పుడు మీరు ఒకే లాగిన్‌తో %జ్రూఖీూ% అన్ని ముఖ్యమైన సర్వీసులను యాక్సెస్ చేయవచ్చు. అవును ఇకపై రెండు లాగిన్‌లతో ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. ఈ కొత్త రిఫార్మ్ గురించి కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా ప్రకటించారు. ఈ చేంజ్‌తో సభ్యుల ఫిర్యాదులు తగ్గడమే కాకుండా, పారదర్శకత, సంతృప్తి కూడా పెరుగుతుందన్నారు. గతంలో %జ్రూఖీూ% సర్వీసుల కోసం రెండు వేర్వేరు లాగిన్‌లు (మెంబర్ పోర్టల్, పాస్‌బుక్ పోర్టల్) ఉపయోగించాల్సి వచ్చేది. ఇది కొంతమందికి పాస్‌వర్డ్ సమస్యలను తెచ్చేది. కానీ, ఇప్పుడు 3.0 రిఫార్మ్‌లో భాగంగా పాస్‌బుక్ లైట్ అనే కొత్త ఫీచర్‌ను లాంచ్ చేశారు. దీంతో మీరు మెంబర్ పోర్టల్‌లోనే మీ కంట్రిబ్యూషన్స్, విత్‌డ్రాయల్స్, ప్రస్తుత బ్యాలెన్స్ వంటి వివరాలను సులభంగా చూసుకోవచ్చు. ఈ పాస్‌బుక్ లైట్ ఫీచర్, స్టాండ్‌లోన్ పాస్‌బుక్ పోర్టల్‌పై లోడ్‌ను తగ్గిస్తూ, సర్వీస్ ఎఫిషియన్సీని పెంచుతుంది. మీకు డీటెయిల్డ్ పాస్‌బుక్ లేదా గ్రాఫికల్ డిస్‌ప్లే కావాలంటే, పాత పాస్‌బుక్ పోర్టల్‌ను ఉపయోగించవచ్చు. అంటే, సింపుల్ వివరాల కోసం పాస్‌బుక్ లైట్, డీటెయిల్డ్ రికార్డ్ కోసం పాస్‌బుక్ పోర్టల్ రెండూ మీకు అందుబాటులో ఉంటాయి. జాబ్ మారినప్పుడు పీఎఫ్ అకౌంట్ ట్రాన్స్‌ఫర్ చేయడం కూడా గతంలో కొంత కష్టంగా




ఉండేది. ఫార్మ్ 13 ద్వారా అకౌంట్ ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు, అనెక్సర్ %ఖ% అనే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్‌ను ఆఫీసుల మధ్య షేర్ చేసేవారు. సభ్యులు దీన్ని చూడాలంటే ప్రత్యేకంగా రిక్వెస్ట్ చేయాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు మెంబర్ పోర్టల్‌లోనే అనెక్సర్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ రిఫార్మ్‌తో, మీ %ూఖీ% అకౌంట్ బ్యాలెన్స్, సర్వీస్ రికార్డ్ అప్‌డేట్‌లను ట్రాక్ చేయడం సులభం. అంతేకాదు, ఈ డిజిటల్ రికార్డ్ పెన్షన్ బెనిఫిట్స్ క్యాల్కులేషన్‌కు కూడా ఉపయోగపడుతుంది. అంటే మీ అకౌంట్ గురించి మీకు పూర్తి క్లారిటీ ఉంటుంది. %జ్రూఖీూ% 3.0 రిఫార్మ్‌లో మరో కీలక మార్పు ఏంటంటే, క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రాసెస్‌ను సులభతరం చేయడం. గతంలో %ూఖీ% సర్వీసులు ట్రాన్స్‌ఫర్స్, సెటిల్‌మెంట్స్, అడ్వాన్స్‌లు, రీఫండ్స్ అన్నీ సీనియర్ ఆఫీసర్ల ఆమోదం కోసం వెయిట్ చేయాల్సి వచ్చేది.

## గౌతమ్ అదానీకి సెబీ క్లీన్‌చిట్

న్యూఢిల్లీ: ఊహించిందే జరిగింది. అదానీ గ్రూప్, ఆ గ్రూప్ ప్రధాన ప్రమోటర్లు గౌతమ్ అదానీ, రాజేశ్ అదానీలపై వచ్చిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొట్టి పారేసింది. అదానీ గ్రూప్‌నకు చెందిన లిస్టెడ్ కంపెనీల షేర్లలో 'సంబంధిత' (రిలేటెడ్) పార్టీల లావాదేవీలు జరిగినట్టు 2023 జనవరిలో అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ 'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' సంస్థ చేసిన ఆరోపణలను తోసిపుచ్చింది. తమ దర్యాప్తులో ఇందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని ప్రకటించింది. దీనికి సంబంధించి సెబీ బోర్డు సభ్యులు కమలేష్ సీ వర్షానీ గురువారం రెండు ఆదేశాలు జారీ చేశారు. ఆదికార్ప్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, మైల్‌స్టోన్ ట్రేడ్‌లింక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రెహ్వార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలు.. అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు అసలు 'సంబంధిత' పార్టీల లావాదేవీల నిర్వచనం




పరిధిలోకే రావని సెబీ తేల్చింది. ఈ సంస్థలు అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల నుంచి తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లించినప్పుడు 'సంబంధిత' లావాదేవీల ప్రశ్నే తలెత్తదని స్పష్టం చేసింది. ఇప్పటికే 'సుప్రీం' నుంచి హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక అప్పట్లో దేశంలో పెద్ద ప్రకంపనలే సృష్టించింది. ప్రభుత్వ అండదండలతోనే అదానీలు ఇందుకు సాహసించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇప్పటికే అదానీ గ్రూప్ సంస్థలు, గౌతమ్ అదానీ, రాజేశ్ అదానీలకు క్లీన్‌చిట్ ఇచ్చింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006